# డలాస్‌లో నవతరం స్వరమాధురి




తానా, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (టాన్‌టెక్స్)ల సంయుక్త ఆధ్వర్యంలో డలాస్‌లో నవతరం గాయకుల గాన కళాకౌశలాన్ని వెలికి తీయడమే లక్ష్యంగా ఓ సంగీత విభావరిని నిర్వహించారు. హర్స్ట్‌లోని ఎల్.డి.బెల్ హైస్కూలు లో వందల మంది ఆహుతుల మధ్య నిర్వహించిన ఈ సంగీత విభావరి మే 1వ తేదీన విజయవంతంగా సాగింది.

కార్యక్రమంలో తొలుత తానా రీజినల్ డైరెక్టర్ మురళీ వెన్నం అతిథులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దాదాపు 500 మందికి పైగా పాల్గొన్నారు. టాన్‌టెక్స్ కల్చరల్ కమిటీ సారథులు రాజేశ్వరి చల్లా, సుబ్బారావు పొన్నూరులను మురళి సభకు పరిచయం చేశారు.

సభికుల ప్రశంసల ఆకర్షణగా సాగిన నవతరం స్వరమాధురి కార్యక్రమం సీనియర్ గాయకుడు సంగీత దర్శకుడు జి.ఆనంద్ సారథ్యంలో సాగింది. ఔత్సాహిక గాయకులు ప్రణవి, శ్రీరంజని సౌమ్య, రవి, దీప్తి, భువనకృతి తదితరులు పాల్గొన్నారు. మాటీవీ వంట కార్యక్రమం మాపూరి వంట కార్యక్రమం బృందం కూడా ఈ సభలో పాల్గొన్నారు. యాంకర్ చిత్రలేఖ తమ కార్యక్రమానికి లభిస్తున్న మద్దతు గురించి సభికులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వరమాధురి కార్యక్రమంలో పాల్గొన్న గాయకులు అందరూ కూడా పాత కొత్త సినిమా పాటల అద్భుతమైన మేళవింపుగా గొప్పగొప్ప పాటలను ఆలపించారు. ప్రతిపాటను కూడా ప్రేక్షకులు పూర్తిస్థాయిలో ఆస్వాదించారు. తమకు ఇష్టమైన పాట ప్లే అవుతున్నప్పుడు ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు మిన్నుముట్టాయి.

తానా కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ తెలుగుసమాజానికి సేవలు అందించడంలో తానా నిరంతర కృషిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 6500 పైగా కార్యక్రమాలు

నిర్వహిస్తూ యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తున్న జి.ఆనంద్‌ను ఆయన అభినందించారు.

ముందుగా సౌత్‌వెస్ట్ రీజియన్‌కు సంబంధించి టాప్‌సింగర్ పోటీ నిర్వహించారు. స్వరమాధురి బృందం పర్యవేక్షణలో 15 మంది పాల్గొన్నారు. జి.ఆనంద్, ప్రణవి, అంజన, సౌమ్య, దీప్తి, రవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విక్రం గండికోట, గోపీనాద్ పేటూరి ఇద్దరూ ఫైనలిస్టులుగా నిలిచారు. చివరికి విక్రం గండికోట విజేత అయ్యారు.

ఇటీవలి కాలంలో భారత్‌లోని మారుమూల గ్రామాల్లో తానా ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాలకు సంబంధించిన వీడియో ఫుటేజిని కార్యక్రమంలో ప్రదర్శించిన అనంతరం ఆపరేషన్ ఎన్విజన్ పేరిట తానా నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమానికి దాతలు ఉదారంగా సహకరించాల్సిందిగా తానా ఫౌండేషన్ తరపున ట్రెజరర్ దిలీప్ కూచిపూడి సభికులను కోరారు.

తానా తరపున కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు ప్రసాద్ తోటకూర, ట్రెజరర్ రామ్ యలమంచిలి, మురళి వెన్నం, దిలీప్ కూచిపూడి, టాన్‌టెక్స్ ప్రెసిడెంట్ చంద్ర కన్నెగంటి, ప్రెసిడెంట్ ఎలక్ట్ ఎన్‌ఎంఎస్ రెడ్డి, తదితరులు స్వరమాధురి బృందాన్ని జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్లేనోకు చెందిన పదేళ్ల చేతన్‌రెడ్డికి ప్రత్యేక ప్రశంస సర్టిఫికెట్‌ను అందించారు. 52వ డలాస్ మార్నింగ్ న్యూస్ స్పెల్లింగ్ బీ పోటీల్లో చేతన్‌రెడ్డి ప్రథమ బహుమతి సాధించారు.